## ప్రజాభవన్‌గా క్యాంపు కార్యాలయం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రంగారెడ్డి దంపతులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 22 : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10గంటలకు ఆయన సతీమణితో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రజాభవనంగా నామకరణం చేశామని అన్నారు. ఇక నుంచి ప్రజలు ఎవరైనా నేరుగా క్యాంపు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను చెప్పుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌పర్సన్ కప్పరి స్రవంతి, జడ్పీటీసీ మహిపాల్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఆదిబట్ల, ఏప్రిల్ 22 : ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు ఉపాధ్యాయులు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పరమేశ్, ఉపాధ్యాయురాలు బాబ్లీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరుట్లలో ఇంద్రారెడ్డి వర్ధంతి

ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మంచాల, ఏప్రిల్ 22 : మండలంలోని ఆరుట్ల గ్రామంలో సోమవారం మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల భాషా, వెంకటేశ్, కావలి శ్రీనివాస్, బుగ్గరాములు, వెదిర హనుమంత్‌రెడ్డి, చీమల జంగయ్య, మోహన్ నాయక్, గుడ్డిమల్ల చంద్రయ్య, చిందం ఐలయ్య, అశోక్, ఎండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

# ధరిత్రిని కాపాడుకోవడం సామాజిక బాధ్యత

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 22: ధరిత్రిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని ప్రకృతి వైద్యులు డాక్టర్ కేవై రామచంద్ర, ఎన్‌జీ పద్మ అన్నారు. సోమవారం కుంట్లూరులోని గాంధేయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పరిసరాల్లోని ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను ఒకచోట చేర్చి తగులబెట్టారు. భూమిని కాపాడుతూ ఆరోగ్యవంతమైన నేలను భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ భూతం భూమిపైకి రాకుండా తమవంతుగా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమి, స్వచ్ఛమైన నీరు, పర్యావరణ పరిరక్షణకు సుమారు 12 వేల మంది ప్రతినిధులతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థ ప్రతినిధులు డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్, కృష్ణయ్య, ప్రేమ్‌కుమార్, టీ సురేందర్, చైతన్యరెడ్డి, శివా రెడ్డి, కే సుభాశ్‌చంద్ర, రఘురాం, సాయినీరజ్, జీనాతున్నీసా, సతీశ్‌రెడ్డి, సురేశ్, హర్షవర్ధన్, భిక్షపతి, ఆనంద్ పాల్గొన్నారు.

ధరిత్రిని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు

# బర్డ్‌ఫ్లూపై టెన్షన్ వద్దు

**వైరస్ ఎపిడమిక్ కావచ్చు..**

- పాండమిక్ అయ్యే అవకాశాలు తక్కువ
- గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): కరోనా వైరస్‌తో మొన్నటి వరకు అతలాకుతలమైన జనం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మరోసారి బర్డ్‌ఫ్లూ భయపెడుతోంది. కొన్ని రోజులుగా కేరళను వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే బర్డ్‌ఫ్లూపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యనిపుణులు. ఎందుకంటే బర్డ్‌ఫ్లూకు పాండమిక్ కెపాసిటి అనేది చాలా తక్కువగా ఉండటం వల్ల అది దూర ప్రాంతాలకు వ్యాప్తి చెందే అవకాశాలు పెద్దగా ఉండకపోవచ్చంటున్నారు. పక్షులు, కోళ్ల నుంచి వ్యాప్తి చెందే ఈ వైరస్ మనుషులపై తీవ్రంగా ప్రభావం చూపిన దాఖలాలు పెద్దగా లేవంటున్నారు నిపుణులు. ప్రస్తుతం దేశంలో కేరళ మినహా ఇతర ఏ ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ కేసులు పెద్దగా నమోదు కాలేదంటున్నారు వైద్యులు.

**లక్షణాలు: జలుబు, దగ్గు, తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు**

### బర్డ్ ఫ్లూపై భయం అవసరం లేదు..

బర్డ్‌ఫ్లూ గురించి ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బర్డ్‌ఫ్లూకి పాండమిక్ సామర్థ్యం చాలా తక్కువ. అయితే అది ఎపిడమిక్ అయ్యే అవకాశాలున్నాయి. వైరస్ మూడు రకాలుగా ఉంటుంది. అందులో కొన్ని ఎండమిక్, కొన్ని పాండమిక్, మరికొన్ని ఎపిడమిక్ ఉంటాయి. ఎపిడమిక్ అంటే ఒక జిల్లాలో వైరస్ సోకితే అది చుట్టుపక్కల జిల్లాలకు వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అంతేకాని ఖండాంతరాలు, దేశాలు దాటి వ్యాపించే అవకాశాలు అతి తక్కువ అని చెప్పవచ్చు. కరోనా వైరస్ విషయానికొస్తే గతంలో కూడా కరోనా ఉంది. కాని అది పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే వైరస్‌లో మ్యుటేషన్‌లు రావడం వల్ల కొత్త రకమైన కరోనా వైరస్‌లు పుట్టుకొచ్చి, పాండమిక్‌గా మారింది. అలాగే బర్డ్‌ఫ్లూలో కూడా ప్రస్తుతం ఎపిడమిక్ మాత్రమే అయ్యే అవకాశాలున్నాయి. ఒకవేల బర్డ్‌ఫ్లూలో వైరస్ మ్యుటేషన్‌లు చెంది, కొత్త రకమైన బర్డ్‌ఫ్లూ వైరస్‌లు పుట్టుకొస్తే మాత్రమే పాండమిక్ వచ్చే అవకాశాలుంటాయి. ప్రస్తుతానికి అలాంటి పరిస్థితులేవీ కనిపించడం లేదు. అందుకని ప్రజలు బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ దవాఖాన

### ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు..

బర్డ్‌ఫ్లూ వైరస్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదు. కరోనా చికిత్స తరహాలోనే సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరుగుతుంది. జ్వరం ఉంటే జ్వరానికి, జలుబు, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే ఆ లక్షణాల ఆధారంగానే చికిత్స చేయాలి.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మంచాల, ఏప్రిల్ 22 : గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఏ విధంగా జరుగుతుందని, అదేవిధంగా తాగునీటి ట్యాంకులు శుభ్రంగా ఉన్నాయా? అని ఆయన పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరుట్ల గ్రామానికి మిషన్ భగీరథ తాగునీటి సమస్య లేకుండా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రతి ఇంటికీ నల్లాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యపై ఎక్కడ ఫిర్యాదులు వచ్చినా వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్లలో గ్రామసంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

## రేపు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, ఏప్రిల్ 22 :నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం ఆమనగల్లు బ్లాక్ మండలాల్లోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఉదయం 10 గంటలకు రోడ్డుషోతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచారం ప్రారంభవుతుందని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తలకొండపల్లి మండలం, సాయంత్రం 4 గంటలకు కడ్తాల్ మండలం, రాత్రి 7 గంటలకు మాడ్గుల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో రోడ్డుషోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ప్రచార కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండలానికి సంబంధించి ఉదయం 10 గంటలకు పట్టణంలోని రెడ్‌రోజ్ గార్డెన్స్‌లో, కొందుర్గు మండల కేంద్రంలోని జీ.ఎం పటేల్ గార్డెన్‌లో మధ్యాహ్నం 1:30 నిమిషాలకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించి సన్నాహక సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు పట్టణ, మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 22: విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రముఖ వక్త భాస్కరయోగి అన్నారు. సోమవారం చేవెళ్లలోని వివేకానంద కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పనిలోనూ ప్రయత్నలోపం లేకుండా పట్టుదలతో ముందుకు నడిస్తే అనుకున్నది సాధిస్తామన్నారు. విద్యార్థులు ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ కోర్స్ వర్క్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ, వాటిని 29 నుంచి నిర్వహించాలని తాజాగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను www.osmania.ac.inలో చూసుకోవాలన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 22: కాకతీయ ఐఏఎస్ అకాడమీలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత శిక్షణను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు తెలిపారు. అకాడమీ డైరెక్టర్, ప్రముఖ పోటీ పరీక్షల నిపుణుడు అమర్‌నాథ్ ఆధ్వర్యంలో 50 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారని చెప్పారు. దీనికి సంబంధించిన తరగతులు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతున్నాయని, వివరాలకు 9160 571483, 9182 3998 58 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 22: సమష్టి కృషితో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు చేసి మరింత పేరు తెచ్చేలా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. వెంకటరమణ సూచించారు. సోమవారం వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ ఏడాది కార్యాచరణ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రవేత్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ, పర్యావరణ పరిరక్షణ , రైతుల లాభదాయకత, ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపుదల తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించి నూతన వంగడాలను రూపొందించాలన్నారు.

# నేడు హనుమాన్ విజయ యాత్ర

- కర్మన్‌ఘాట్ వయా కోఠి టూ తాడ్‌బన్ వరకు ర్యాలీ
- ఉదయం 11.30 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): నేడు నగరంలో జరిగే హనుమాన్ జయంతి విజయయాత్ర సందర్భంగా ఉదయం 11.30 గంటల నుంచి ర్యాలీ పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ సికింద్రాబాద్ తాడ్‌బన్ హనుమాన్ ఆలయం వరకు 12 కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. ఈ ర్యాలీ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమై మరో ర్యాలీ చంపాపేట్, ఐఎస్ సదన్, దోబీ ఘాట్, సైదాబాద్ వై జంక్షన్, శంకేశ్వర్‌బజార్ నుంచి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ట్యాంక్ అక్కడి నుంచి దిల్‌సుఖ్‌నగర్ తిరిగి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి దిల్‌సుఖ్‌నగర్ మీదుగా మూసారాంబాగ్, నల్గొండ క్రాస్‌రోడ్స్, చాదర్‌ఘాట్ నుంచి కోఠి లోని గౌలిగూడ నుంచి వచ్చే ప్రధాన ర్యాలీకి కలుస్తుందని చెప్పారు. సుమారు 10.8 కిలో మీటర్లు ఈ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ర్యాలీల సందర్భంగా గౌలిగూడ నుంచి బయలుదేరే ర్యాలీ పుల్లీబౌలి, కోఠి ఆంధ్రాబ్యాంకు, కోఠి డీఎం అండ్ హెచ్ ఎస్(కర్మన్‌ఘాట్ నుంచి వచ్చే ర్యాలీ ఇక్కడే కలుస్తుంది), సుల్తాన్‌బజార్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, గాంధీనగర్, వైస్రాయ్ హోటల్ వెనుక నుంచి ప్రాగ టూల్స్, కవాడిగూడ, సీజీవో టవర్స్, బన్సీలాల్‌పేట్ రోడ్డు, బైబిల్ హౌస్, సిటీలైట్ హోటల్, బాటా షో రూం, ఉజ్జయినీ మహంకాళీ టెంపుల్, రాంగోపాల్‌పేట్ పీఎస్, పారడైజ్ క్రాస్ రోడ్స్, సీటీఓ జంక్షన్, లీ రాయల్ ప్యాలెస్, బ్రూక్ బాండ్, ఇంపీరియల్ గార్డెన్, మస్తాన్ కేఫ్ వద్ద ఎడమ వైపు తీసుకొని తాడ్‌బన్ హనుమాన్ ఆలయానికి చేరుకుంటుందన్నారు. దాదాపు 21కిలో మీటర్ల మేర కర్మన్‌ఘాట్ నుంచి తాడ్‌బన్ వరకు ఈ ర్యాలీలు సాగుతాయని, రాత్రి 8 గంటల వరకు ఈ ర్యాలీ పూర్తయ్యే అవకాశాలున్నాయని వెల్లడించారు. ర్యాలీలు వెళ్లే సమయంలో ఆయా కూడళ్లలో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు సీపీ తెలిపారు. వాహనదారులు మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సీపీ సూచించారు. ఇదిలా ఉండగా హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆయా పోలీస్ కమిషనర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి

ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహేందర్‌రెడ్డి, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 22 : మాజీ హోంమంత్రి దివంగత ఇంద్రారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సామ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వర్ధంతి సందర్భంగా ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రారెడ్డి అడుగు జాడల్లో ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నడుస్తున్నట్లు తెలిపారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 22: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ బాలాజీకాలనీలో సమస్యలను కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ , తాగునీరు కలుషితమై వస్తుందని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి తాగునీరు కలుషితం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలను శుభ్రంగా ఉంచుకోవాలి

కమలానగర్‌లో కాలనీవాసులతో కలిసి సందర్శిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 22 : డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో పారిశుధ్య కార్మికుల పనితీరుపై కాలనీవాసులను అడిగి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కాలనీ అధ్యక్షుడు టీవీ రావు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధానకార్యదర్శి సుబ్బారావు, దివాకర్, లింగం, పుష్ప, రంజలి తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూహెచ్‌లో టెక్నికల్ ఫెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 24 : వర్సిటీలో నేర్చుకున్న పరిజ్ఞానంతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని, నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ కట్టా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం వర్సిటీ జేఎన్ ఆడిటోరియంలో టెక్నికల్ ఫెస్ట్ 2024 ప్రారంభోత్సవంలో వీసీ కట్టా నరసింహారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటనర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నైపుణ్యం ఉంటే మంచి అవకాశాలు వస్తాయని, ఉద్యోగాలు పొందడమే కాదు.. సృష్టించేలా ఎదగాలన్నారు. యేడాదిలో నేర్చుకున్న పరిజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలు చేపడితే.. ఆ ప్రదర్శనలు సమాజానికి తెలుస్తాయని, వాటితో విద్యార్థుల భవిష్యత్ మారిపోతుందన్నారు. టెక్‌ఫెస్ట్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

సెల్ఫ్ క్లోజ్డ్ ఫ్లడ్ బేరియర్ నమూనాతో విద్యార్థులు సాంకేత్, వేణు, నవీన్, విజయ్‌రాజ్, విషిత

# జీఎస్ఐలో శిక్షణా కార్యశాల ప్రారంభం

జీఎస్ఐలో శిక్షణా కార్యశాలను ప్రారంభిస్తున్న కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సంజయ్ లోహియా తదితరులు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 22: అరుదైన, వ్యూహాత్మకమైన ఖనిజాల అన్వేషణపై జీఎస్ఐ శిక్షణా సంస్థ కార్యాలయంలో శిక్షణ కార్యశాలను కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సంజయ్ లోహియా, డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాథ్యు జోసెఫ్, డైరెక్టర్ వివేక్ కుమార్ శర్మతో కలిసి సోమవారం ప్రారంభించారు. నేషనల్ జియోసైన్స్ డేటా రిపోజిటరీ పోర్టల్, కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం అన్వేషణ, ఆధునిక సాంకేతికత అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సంజయ్ లోహియా మాట్లాడుతూ... తొలి రోజు నిర్వహించిన నేషనల్ జియోసైన్స్ డేటా రిపోజిటరీ శిక్షణలో ప్రాజెక్ట్ ప్రతిపాదనల రూపకల్పనలో సైంటిస్టుల సమస్యలపై ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు

## ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడానికి పలు విద్యాసంస్థల్లో, పలు వీధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ ఆదేశాల మేరకు ర్యాలీలు, అవగాహన సమావేశాలు ముమ్మరంగా చేపడుతున్నారు. ముఖ్యంగా రెసిడెన్షియల్ అసోసియేషన్, స్వయం సహాయక సంఘాల మహిళలు స్లమ్, టౌన్ ఫెడరేషన్ సమావేశాలు ఏర్పాటు చేసి వారికి ఓటు హక్కు వినియోగం, ఓటు హక్కు ఓటర్ల బాధ్యతను తెలియజేయడం, ఓటు తప్పనిసరిగా వేయాలని... ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని అవగాహన కల్పిస్తున్నారు. పోలింగ్ బూత్‌ను కూడా చెక్ చేసుకోవాలని కార్యక్రమంలో వివరిస్తున్నారు.

## కుక్కల దాడి.. 15మేకలు మృత్యువాత

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 22 : కొండన్న గూడ గ్రామంలో గున్న మల్లయ్య మేకల మందపై కుక్కలు ఆదివారం రాత్రి దాడి చేశాయి. ఈ దాడిలో 15 మేకలు మృతి చెందాయి. బాధితుడు బోరున విలపించారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు